


## ఏసీపీని కలిసిన కార్పొరేటర్

మియాపూర్, ఫిబ్రవరి 25 : కూకట్‌పల్లి నూతన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రావును ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.




# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 25 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి రంగధాముని చెరువు గట్టుపై సంత్ నిరంకార్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాజెక్ట్ అమృత్–స్వచ్ఛ నీరు, స్వచ్ఛ మనసు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు ప్రారంభించి మాట్లాడారు. భూమిపై భవిష్యత్ తరాలు మనుగడ సాగించాలంటే పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలన్నారు. సమస్త జీవరాశుల మనుగడకు నీరు అవసరమని, నీటి వనరులను కాపాడుకోవాలని కోరారు. చెరువు పరిసరాల ను శుభ్రం చేసేందుకు ముందుకు వచ్చిన సేవకులను,సంస్థ నిర్వాహకులను అభినందించారు. మాజీ కార్పొరేటర్ బాబురావు, సంత్ నిరంకార్ మిషన్ తెలంగాణ, ఏపీ జోనల్ ఇన్‌చార్జి మొహినబెహన్ ప్రభాకర్‌రెడ్డి, జంగయ్య, లక్ష్మీసాయి, మాధవి, రత్న, జయ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే లాస్యనందిత మృతి బాధాకరం

రోడ్డుప్రమాదంలో మృతి చెందిన సికింద్రాబాద్– కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత కుటుంబాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. ఆదివారం బీఆర్‌ఎస్ నేత కేటీఆర్‌తో కలిసి ఎమ్మెల్యే కృష్ణారావు ఎమ్మెల్యే లాస్యనందిత ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె తల్లి, కుటుంబసభ్యులను పరామర్శించారు.


రంగధాముని చెరువుగట్టుపై 'ప్రాజెక్ట్ అమృత్–స్వచ్ఛనీరు, స్వచ్ఛ మనసు' కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

## నేడు కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో 'ప్రజావాణి'

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 25 : కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో ప్రతి సోమవారం 'ప్రజావాణి' నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



















